PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

సీపీ రెడ్డి మరణానికి కారణమైన వారే నేడు వర్ధంతులు నిర్వహిస్తున్నారు


3లో

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బల్గూరి మహేందర్ రావుకు పీహెచ్‌డీ ప్రదానం



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 318 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 11 నవంబర్ 2026

కరవు రైతులకు అండగా బ్యాంకులు నిలవాలి

- అర్హులైన రైతుల పంట రుణాల రీషెడ్యూల్‌కు ఆదేశాలు
- రబీ సీజన్‌లో కొత్త రుణాలు సకాలంలో అందించాలి
- 365 మండలాల్లో కరవు.. 111 మండలాల్లో తీవ్ర పరిస్థితులు
- బ్యాంకర్లకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం



హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు బ్యాంకులు అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. కరవుతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన రైతుల పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. మిగతా2లో...

ప్రజల నమ్మకమే పోలీసుల బలం!

- ప్రజల కోసం అధికార హోదాను జాగ్రత్తగా వినియోగించాలి
- పోలీసు అధికారులు నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలి
- అవసరమైతే అధ్యయనం కోసం విదేశాలకు పంపిస్తాం
- ప్రొబేషనరీ డీఎస్పీలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం


2లో

భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీకి ఆహ్వానం

హైదరాబాద్ సదస్సులో పాల్గొనాలని మహేశ్ గౌడ్ వినతి.. 100 దేశాల ప్రతినిధులకు ఆహ్వానం



2లో

13న బంగాళాఖాతంలో


అల్పపీడనం

- తదుపరి 24 గంటల్లో తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశం


2లో

చంద్రబాబు కేసులపై హైకోర్టు తీర్పు రిజర్వ్

- సీబీఐ, ఈడీకి అప్పగించాలన్న పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలు పూర్తి



అమరావతి,10 (పిసిడబ్ల్యూ న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతరులపై గతంలో నమోదైన పలు కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీకి అప్పగించాలన్న పిటిషన్లపై మిగతా2లో...

416 గ్రామాల్లో భూ రీసర్వే పూర్తి

- వెయ్యి గ్రామాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియ
- చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో భూ వివాదాలకు కారణం కాకూడదు
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు 416 గ్రామాల్లో సర్వే పూర్తికాగా, వెయ్యికి పైగా గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభమయ్యాయి. తొలి దశలో మొత్తం 2,720 గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. తరతరాలుగా కొనసాగుతున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు ప్రతి భూ యజమానికి స్పష్టమైన మిగతా2లో...



ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న బీజేపీ

మోదీ ప్రభుత్వ విధానాలపై సోనియాగాంధీ విమర్శలు
దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, మీడియా స్వేచ్ఛపై ఆందోళన

న్యూఢిల్లీ,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థలను క్రమంగా నిర్వీర్యం చేస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ విమర్శించారు. రాజకీయ, ఆర్థిక అధికారాన్ని కేంద్రీకరిస్తూ ప్రతిపక్షాల గొంతును నొక్కేస్తోందని ఆరోపించారు. మంగళవారం విడుదలైన తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో మిగతా2లో...

డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల కట్టడికి

సుప్రీంకోర్టు చర్యలు

- వాట్సాప్ సహా డిజిటల్ వేదికలకు కీలక ఆదేశాలు..
- అనుమానాస్పద లావాదేవీల నిలిపివేతకు సూచనలు


2లో

టర్కీ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం..

- భారీ పేలుడులో 16 మంది మృతి
- 13 మందికి గాయాలు..
- మరమ్మతు పనుల సమయంలో ఘటన


2లో

శిక్షణార్థులకు అంతర్జాతీయ

వసతి సదుపాయం

- జీఎస్ఐలో నలంద ఇంటర్నేషనల్ హాస్టల్ ప్రారంభం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం



హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ కోసం హైదరాబాద్‌కు వచ్చే విద్యార్థులు, శిక్షణార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే దిశగా మరో ముందడుగు పడింది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్‌లో నూతనంగా నిర్మించిన నలంద మిగతా2లో...

ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తున్న బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ విధానాలు, దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల పనితీరుపై పలు అంశాలను ప్రస్తావించారు. ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులపై ఉపయోగిస్తున్నారని సోనియా ఆరోపించారు. ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేస్తూ, పార్లమెంటులో తగిన చర్చ లేకుండానే కీలక బిల్లులను ఆమోదిస్తున్నారని విమర్శించారు. ప్రధాన స్రవంతి మీడియాలోని కొన్ని విభాగాలు స్వతంత్రతను కోల్పోయాయని, ప్రభుత్వాన్ని విమర్శించేవారిపై సామాజిక మాధ్యమాల్లో దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. 2016 నోట్ల రద్దు నిర్ణయం ప్రజలకు, వ్యాపార రంగానికి తీవ్ర ఇబ్బందులు కలిగించిందని తెలిపారు. జీఎస్టీ అమలుతోనూ సమస్యలు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో ఆర్ఎస్ఎస్ భావజాల ప్రభావం పెరుగుతోందని, పాఠ్యపుస్తకాల్లో మార్పులు, నియామకాల ద్వారా విద్యా వ్యవస్థపై ప్రభావం చూపుతున్నారని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి, వాటి పరిధిని తగ్గించారని సోనియా విమర్శించారు. మైనారిటీలు, దళితులపై దాడులు, నిరసనలపై ఆంక్షలు వంటి అంశాలపైనా ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ సంస్థల స్వతంత్రతను, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన అవసరం ఉందని తన ఆత్మకథలో పేర్కొన్నారు.

డిజిటల్ అరెస్టులు, సైబర్ మోసాల కట్టడికి సుప్రీంకోర్టు చర్యలు

న్యూఢిల్లీ,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): దేశవ్యాప్తంగా పెరుగుతున్న డిజిటల్ అరెస్టు మోసాలు, సైబర్ నేరాలను అరికట్టేందుకు సుప్రీంకోర్టు కీలక చర్యలకు ఉపక్రమించింది. ఈ తరహా నేరాల నివారణకు తీసుకోనున్న చర్యలు, రూపొందించిన ప్రతిపాదనల వివరాలను సమర్పించాలని వాట్సాప్‌తో పాటు ఇతర డిజిటల్ వేదికలను ఆదేశించింది. తమ ప్రతిపాదనలను భారత సైబర్ నేరాల సమన్వయ కేంద్రం (ఐ4సీ)కి కూడా అందజేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. డిజిటల్ అరెస్టు మోసాలపై సుప్రీంకోర్టు స్వయంగా విచారణ చేపట్టి, గత కొన్ని నెలలుగా పరిస్థితిని పర్యవేక్షిస్తోంది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన చర్యలపై నివేదిక సమర్పించింది. ఇందులో భాగంగా పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారుల పేర్లతో ప్రజలను మోసగిస్తున్న సైబర్ నేరగాళ్లకు సంబంధించిన సుమారు 9,400 ఖాతాలను వాట్సాప్ నిషేధించినట్లు వెల్లడించింది. సైబర్ మోసాల బారినపడి డబ్బులు కోల్పోతున్న బాధితులకు న్యాయం జరిగేలా బ్యాంకులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ధర్మాసనం సూచించింది. బ్యాంకుల నిర్లక్ష్యం లేదా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మోసాలు జరిగినట్లు దర్యాప్తులో తేలితే బాధితులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని పరిశీలించాలని పేర్కొంది. అలాగే అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, వెంటనే పోలీసు అధికారులను అప్రమత్తం చేయడం వంటి రక్షణ చర్యలను రూపొందించాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ని ఆదేశించింది. అధీకృత ఆర్థిక సంస్థల జాబితాను నవంబర్ 23లోగా సమర్పించాలని సూచించింది. ఈ కేసులో తదుపరి విచారణను నవంబర్ 23కు వాయిదా వేసింది.

ప్రజల నమ్మకమే పోలీసుల బలం!

హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): సమాజంలో పోలీస్ వ్యవస్థకు ఉన్న విశ్వసనీయతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలు పోలీసులను నమ్మి తమ సమస్యల పరిష్కారం కోసం ఆశ్రయించేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు అధికారులకు లభించిన హోదాను ప్రజాసేవ కోసమే వినియోగించాలని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ప్రొబేషనరీ డీఎస్పీల ముఖాముఖి కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన అధికారులకు అవార్డులు అందజేశారు. క్రైమ్ సీన్స్ ఫోరెన్సిక్ హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. **పారదర్శకంగా నియామకాలు..** గతంలో గ్రూప్-1 నియామకాలు ఆలస్యం కావడంతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని సీఎం గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి టీజీపీఎస్సీని అదే తరహాలో తీర్చిదిద్దినట్లు తెలిపారు. పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి ఉన్నవారిని కమిషన్ సభ్యులుగా నియమించామని చెప్పారు. మొత్తం 112 మంది డీఎస్పీల నియామకాల్లో పూర్తి పారదర్శకత పాటించామని వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారి పిల్లలు కూడా ఈ నియామకాల్లో ఎంపికయ్యారని పేర్కొన్నారు. నియామకాలపై కొందరు కోట్ల రూపాయల అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసినప్పటికీ, ప్రభుత్వం సుప్రీంకోర్టు వరకు వెళ్లి నియామకాలను పూర్తి చేసిందని తెలిపారు. **ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి..** కొత్తగా పోలీసు శాఖలోకి వచ్చిన డీఎస్పీలు తమ నేపథ్యాన్ని, ఏ లక్ష్యంతో ఈ శాఖలో చేరారో ఎప్పుడూ మరిచిపోవద్దని రేవంత్‌రెడ్డి సూచించారు. రాబోయే 30 ఏళ్ల తెలంగాణ భవిష్యత్తు ఏ దిశగా సాగాలన్నది పోలీసు అధికారుల పనితీరుపైనా ఆధారపడి ఉంటుందని అన్నారు. నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ బాధ్యతతో పనిచేయాలని, ప్రజల సమస్యలను ఓపికగా వినాలని సూచించారు. బాధితులను కూర్చోబెట్టి ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని చెప్పారు. అధికారుల నిర్ణయాలు, వారి నుంచి వచ్చే అభిప్రాయాలు ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. **మారుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలి..** ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతోందని, ముఖ్యంగా సైబర్ నేరాల ద్వారా వ్యక్తులను ప్రత్యక్షంగా కలవకుండానే వారి ఆస్తులను దోచుకుంటున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ సరఫరా, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థలను తీసుకొచ్చిందని వివరించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసి కఠిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఫుడ్ సేఫ్టీ, ట్రాఫిక్, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల కట్టడికి ఆధునిక విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. **విదేశాల్లో శిక్షణకు అవకాశం..** పోలీసు అధికారులు వృత్తిపరమైన నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సీఎం సూచించారు. అవసరమైతే నూతన డీఎస్పీలను మరింత అధ్యయనం, ఆధునిక పోలీసింగ్ విధానాల అవగాహన కోసం విదేశాలకు పంపిస్తామని ప్రకటించారు. విధి నిర్వహణతోపాటు శారీరక దృఢత్వంపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు శివధర్‌రెడ్డి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ వైస్ చైర్‌పర్సన్ శాంతకుమారి, డీజీపీ సీవీ ఆనంద్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కరవు రైతులకు అండగా బ్యాంకులు నిలవాలి

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించి, వారు తదుపరి వ్యవసాయ సీజన్‌ను ఆత్మవిశ్వాసంతో ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశానికి భట్టి విక్రమార్క హాజరై మాట్లాడారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించామని, వీటిలో 111 మండలాల్లో తీవ్ర కరవు పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకులు ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పించాలని కోరారు. **రబీ రుణాలు సకాలంలో అందించాలి** రబీ సీజన్‌కు సంబంధించి కొత్త పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలని భట్టి సూచించారు. రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, అర్హత కలిగిన ప్రతి రైతుకు సులభంగా రుణాలు అందేలా చూడాలని ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేసుకునే పంటలకు ప్రాధాన్యతనిస్తూ రుణాలు మంజూరు చేయాలని, పంటల మార్పిడి, సూక్ష్మ సేద్యానికి ఆర్థిక సహకారం అందించాలని సూచించారు. **రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు** కరవు ప్రభావంతో వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కనీసం 10 నుంచి 15 శాతం రైతు కుటుంబాలకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. **ఇతర రంగాలకూ రుణాలు పెంచాలి** విద్య, గృహ రుణాల మంజూరులో బ్యాంకులు సానుకూలంగా వ్యవహరించాలని భట్టి విక్రమార్క సూచించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పంపిణీని పెంచాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలకు అదనంగా రూ.2 లక్షల వరకు రుణాలు అందించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ నెల 19వ తేదీ నాటికి రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు బ్యాంకర్లు అవసరమైన సహకారం అందించాలని కోరారు. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

416 గ్రామాల్లో భూ లీసర్వే పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

హక్కులు, కచ్చితమైన హద్దులు కల్పించడమేప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంగళవారం సచివాలయంలో భూ రీసర్వే పురోగతిపై రెవెన్యూ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, రైతుల నుంచి వస్తున్న స్పందన, సాంకేతిక అంశాలు, సర్వే సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. సర్వేలో పాల్గొంటున్న సిబ్బందితో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకున్నారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. **చిన్న తప్పిదానికీ తావివ్వొద్దు** భూ సర్వేలో జరిగే చిన్న పొరపాటు కూడా భవిష్యత్తులో పెద్ద భూ వివాదానికి కారణం కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో సర్వే ప్రారంభించే ముందు సంబంధిత రెవెన్యూ రికార్డులను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రికార్డుల్లోని భూముల విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలని తెలిపారు. **రైతులకు అభ్యంతరాల నమోదు అవకాశం** సర్వే పూర్తయిన వెంటనే సంబంధిత భూ యజమానులకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేయాలని మంత్రి ఆదేశించారు. సర్వేలో నమోదైన వివరాలను పరిశీలించుకునేందుకు, భూముల విస్తీర్ణం, హద్దుల విషయంలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు తగిన అవకాశం కల్పించాలని చెప్పారు. రైతులు తెలిపే అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. సర్వే విధానం, నోటీసుల జారీ, అభ్యంతరాల నమోదు, పరిష్కారంపై గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. **భూదార్ కేటాయింపులు వేగవంతం చేయాలి** సర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రతి భూమికి ప్రత్యేక గుర్తింపునిచ్చే భూదార్ నంబర్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని పొంగులేటి ఆదేశించారు. భూముల హక్కులు, విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాలతో స్పష్టమైన రికార్డులు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. భూ యజమానుల ప్రయోజనాలు, వారి అభిప్రాయాలు, సూచనలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భూ యజమానులకు పూర్తి సంతృప్తి కలిగేలా సర్వే నిర్వహించడమే విజయానికి ప్రామాణికమని పేర్కొన్నారు.

13న బంగాళాఖాతంలో అల్పపీడనం

అమరావతి,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ అల్పపీడనం వాయవ్య దిశగా పయనించి, తదుపరి 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర అల్పపీడనంగా మారే అవకాశముందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. వాయవ్య ఉత్తరప్రదేశ్ నుంచి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా మీదుగా ఉత్తర కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. దీని ప్రభావంతో బుధవారం కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

చంద్రబాబు కేసులపై హైకోర్టు తీర్పు రిజర్వ్

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ వ్యాజ్యాలపై ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబుతో పాటు పలువురిపై ఇన్నర్ రింగ్ రోడ్డు, స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్ గ్రిడ్, రాజధాని అసైన్డ్ భూములు, మద్యం విధానం, ఉచిత ఇసుక విధానాలకు సంబంధించి సీఐడీ కేసులు నమోదు చేసింది. వీటి దర్యాప్తును సీబీఐ, ఈడీకి బదిలీ చేయాలని కోరుతూ బాలగంగాధర తిలక్ 2024లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్కిల్ కేసును సీబీఐకి అప్పగించాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కూడా మరో పిటిషన్ వేశారు. దర్యాప్తులో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను తిరిగి ఇవ్వకుండా విజయవాడ ఏసీబీ కోర్టును ఆదేశించాలని అనుబంధ పిటిషన్ కూడా దాఖలైంది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

టర్కీ ఉక్కు కర్మాగారంలో ఘోర ప్రమాదం..

న్యూఢిల్లీ,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):

టర్కీలోని ఇజ్మీర్ ప్రావిన్స్ అలియాగా ప్రాంతంలో ఉన్న హబాస్ ఉక్కు కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 16 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 13 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కర్మాగారంలో మరమ్మతు పనులు జరుగుతున్న సమయంలో భారీ క్రేన్ కొలిమిపై పడటంతో పేలుడు సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పేలుడు ధాటికి మంటలు వ్యాపించడంతో సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ఘటనపై న్యాయ, పరిపాలనా విచారణకు ఆదేశించారు.

భారత్ సమ్మిట్‌కు రాహుల్ గాంధీకి ఆహ్వానం

హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):

హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారత్ సమ్మిట్‌కు హాజరుకావాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆహ్వానించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసిన ఆయన.. ఈ నెల 12 నుంచి 14 వరకు హైటెక్స్‌లో జరగనున్న మూడు రోజుల సదస్సు వివరాలను తెలియజేసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ఈ సదస్సుకు సుమారు 100 దేశాల ప్రతినిధులను ఆహ్వానించారు. దాదాపు 450 మంది ప్రముఖులు, కేంద్ర మంత్రులు, ఎంపీలు పాల్గొననున్నారు. అంతర్జాతీయ సంబంధాలు, దేశాల మధ్య సహకారం, ఆర్థికాభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. సదస్సులో ఏదో ఒక రోజు రాహుల్ గాంధీ పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

శిక్షణార్థులకు అంతర్జాతీయ వసతి సదుపాయం

(మొదటి పేజీ తరువాయి)

ఇంటర్నేషనల్ హాస్టల్‌ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి శిక్షణ కోసం వచ్చే వారికి నాణ్యమైన వసతి సదుపాయాలు అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని అన్నారు. శిక్షణార్థులు వసతి సమస్యలపై ఆందోళన చెందకుండా, ప్రశాంతమైన వాతావరణంలో తమ విద్య, శిక్షణపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా ఈ హాస్టల్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసతి సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. జీఎస్ఐ వంటి ప్రతిష్టాత్మక సంస్థలో శిక్షణ పొందేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఈ హాస్టల్ ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. శిక్షణా సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధి, నాణ్యమైన వసతి కల్పన ద్వారా శిక్షణార్థులకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, జీఎస్ఐ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

12 నుంచి కొత్త పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

- **రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షల మందికి లబ్ధి**
- **18వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు.. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనకు కలెక్టర్లకు ఆదేశాలు**

హైదరాబాద్,నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా మంజూరైన చేయూత సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాలకు సంబంధిత ఎమ్మెల్యేలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. **ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు** పింఛన్ల పంపిణీ కార్యక్రమాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తుదారుల అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ దరఖాస్తుల పరిశీలనను కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంపికైన లబ్ధిదారుల్లో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, గీత కార్మికులు తదితర వర్గాలకు చెందినవారు ఉన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్ల నగదును ఈ నెల నుంచే లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు బల్గూరి మహేందర్ రావుకు పీహెచ్‌డీ ప్రదానం



పరకాల విద్యార్థిగా ప్రస్థానం ప్రారంభించి.. అదే కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తూ డాక్టరేట్ సాధించడం అభినందనీయం: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బేతి సంతోష్ కుమార్



పరకాల, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్):పరకాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న బల్గూరి మహేందర్ రావుకు కాకతీయ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ప్రొఫెసర్ పి. వరలక్ష్మి పర్యవేక్షణలో "ఇంపాక్ట్ ఆఫ్ రిఫార్మ్స్ ఆన్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఎ స్టడీ ఆఫ్ సెలెక్ట్ యూనిట్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్" అనే అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథానికి ఈ డాక్టరేట్ లభించింది.గత 14 సంవత్సరాలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న మహేందర్ రావు బోధనతో పాటు పరిశోధనా రంగంలోనూ విశేష ప్రతిభ కనబరిచారు. పరకాల సమీపంలోని రంగాపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన ప్రాథమిక విద్యను రంగాపురం, మొగుళ్లపల్లిలో, ఇంటర్మీడియట్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాల పరకాలలో, డిగ్రీని వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాలలో అభ్యసించారు. అనంతరం విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను పూర్తి చేశారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బేతి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించి, అదే ప్రాంతంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా సేవలందిస్తూ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆయన విజయం కళాశాలకు, పరకాల ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది బల్గూరి మహేందర్ రావును శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

సీపీ రెడ్డి మరణానికి కారణమైన వారే నేడు వర్ధంతులు నిర్వహిస్తున్నారు

అవకాశవాదులతో విప్లవకారుల ఐక్యత నష్టదాయకం: షేక్ షావలి

కేతేపల్లి, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): గోదావరిలోయ ప్రతిఘటన పోరాట నిర్మాత, అమరుడు కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డి రూపొందించిన పోరాట సిద్ధాంతం చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని సీపీఐ(ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి అన్నారు. సోమవారం నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం బొప్పారం కమిటీ హాల్లో నిర్వహించిన చంద్రపుల్లారెడ్డి 42వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం సైదులు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా షేక్ షావలి మాట్లాడుతూ.. గతంలో పార్టీని ముక్కలు చేసిన వారే నేడు చంద్రపుల్లారెడ్డి వర్ధంతులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆయన సిద్ధాంతాలను, ప్రతిఘటన పోరాటాలను ప్రస్తావించకపోతే వారికి మనుగడ ఉండదన్నారు. విప్లవకారుల ఐక్యత పేరుతో సిద్ధాంత వ్యతిరేకులతో కలవడం, నిజమైన విప్లవ నాయకులపై దాడులకు పాల్పడడం ఉద్యమానికి నష్టం కలిగించిందని ఆరోపించారు. ఎం.వి.ప్రసాద్, వసంతక్కల హత్యలను ఈ సందర్భంగా గుర్తుచేశారు.అవకాశవాదం, అంతర్గత కుట్రల కారణంగా 2004లో ప్రతిఘటన ఉద్యమ పార్టీ ముక్కలైందని విమర్శించారు. విప్లవోద్యమం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిర్బంధాలకు భయపడి విప్లవ మార్గాన్ని విడిచిపెట్టిన వారికి ప్రజాస్వామ్య రాజకీయాలు నిర్వహించే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాలకు అనుగుణంగా నిజమైన విప్లవ కారుల ఐక్యతతోనే నూతన ప్రజాస్వామిక విప్లవం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.సభ ప్రారంభంలో అమరులకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో బొల్లికొండ లింగయ్య, కారింగుల యాదగిరి, కాశీరాం, దుబ్బ మదు, జలగం లక్ష్మయ్య, గడిపే సునీత, మోనార్ దుర్గాప్రసాద్, తుమ్మరాణి, అనుష తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే పునాది.. దాని పరిరక్షణలో న్యాయవాదులు ముందుండాలి

హక్కులపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి..

ఐఎల్‌పీఏ రాష్ట్ర సదస్సు కరపత్రాల ఆవిష్కరణలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే పౌరుల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వానికి సంపూర్ణ రక్షణ లభిస్తుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడటంతో పాటు వాటిపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించడంలో న్యాయవాదులు క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. న్యాయవాదులు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చినప్పుడే ప్రజాస్వామ్య విలువలు క్షేత్రస్థాయిలో బలపడతాయని పేర్కొన్నారు. హనుమకొండలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) నిర్వహించనున్న ఆరో రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందన్నారు. రాజకీయ విలువలు, రాజ్యాంగ హక్కులు, మానవీయ విలువల గురించి ప్రజలకు తెలియజేయడం అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. రాజకీయ పార్టీల ద్వారా మాత్రమే సమాజంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభించదని, ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన, హక్కుల పట్ల చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు తమ వృత్తి పరిధిని దాటి సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం అనే రాజ్యాంగ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు న్యాయరంగ ప్రముఖులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 14న హనుమకొండ హంటర్ రోడ్డులోని డి-కన్వెన్షన్‌లో ఐఎల్‌పీఏ ఆరో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, హైకోర్టు మాజీ న్యాయమూర్తి, సీనియర్ సిటిజన్స్ కమిషన్ కమిషనర్ ఈద తిరుమలదేవి, వరంగల్ జిల్లా న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ, హనుమకొండ జిల్లా న్యాయమూర్తి ఎం.ఆర్. సునీతతో పాటు వివిధ రంగాలకు చెందిన మేధావులు హాజరుకానుండటం విశేషమన్నారు. ఇలాంటి సదస్సులు న్యాయరంగంలో నూతన ఆలోచనలకు, సామాజిక చైతన్యానికి దోహదపడతాయని పేర్కొంటూ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఐఎల్‌పీఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, సదస్సు కన్వీనర్ చిల్ల రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని ప్రధాన లక్ష్యంగా చేసుకుని అసోసియేషన్ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. న్యాయవాదుల మధ్య సమన్వయం పెంపొందించడంతో పాటు సామాజిక సమస్యలపై చర్చించేందుకు రాష్ట్ర సదస్సు చక్కటి వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల నుంచి న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎల్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు జన్ను పద్మ, జిల్లా నాయకులు పూసపల్లి శ్రీనివాస్, నమ్మనీ చంద్రశేఖర్, జంగా స్వప్న, గురిమిల్ల రాజు, ఎలమాద్రి రవి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్ పాషా..

- ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్ చార్జిగా శంకర్ సాధు
- తెలంగాణ రక్షణ సమితి (డెమొక్రటిక్)లో కీలక నియమకాలు



హనుమకొండ సిటీ, నవంబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్):తెలంగాణ రక్షణ సమితి(డెమొక్రటిక్) పార్టీలో సంస్థాగత బలోపేతంలో భాగంగా నూతన నియామకాలు చేపట్టారు. పార్టీ రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడిగా ఎండీ అహ్మద్ పాషాను, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర సోషల్ మీడియా ఇన్చార్జిగా శంకర్ సాధును నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సరాల సత్యనారాయణ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నూతనంగా నియమితులైన నాయకులకు రాష్ట్ర అధ్యక్షుడు సరాల సత్యనారాయణ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ సాధు, ఎండీ అహ్మద్ పాషా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సరాల సత్యనారాయణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలు, లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి

- ముగ్గురు వ్యక్తులు అదుపులోకి, 3 మోటార్ సైకిళ్లు, 3 కోడిపుంజులు, నగదు స్వాధీనం: రూరల్ సీఐ పంజాల సర్వయ్య

పెనుబల్లి, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :వి ఎం బంజర పోలీస్ స్టేషన్ పరిధిలోని తాల్లపెంట గ్రామ శివారులో గల నరసింహస్వామి చెరువు సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి కోడిపందేలు నిర్వహిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు వి ఎం బంజర పోలీసులు దాడి నిర్వహించారనిసిఐ పంజాల సర్వయ్య తెలిపారు. ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి పందేల కోసం ఉపయోగిస్తున్న 3 కోడిపుంజులు, రూ.1,580/- నగదు, 3 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మిగిలిన నలుగురు వ్యక్తులు అక్కడి నుండి పరారైనట్లు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వి.ఎం. బంజర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది. కోడిపందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలకు ఏవైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సిఐ తెలిపారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- వారం రోజుల్లో యాప్ ప్రవేశపెట్టకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం: టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి



నేరేడ్మెట్, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని టీయూజేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు నవంబర్ 10న మల్కాజిగిరి నియోజకవర్గ టీయూజేఏసీ ఆధ్వర్యంలో నేరేడ్మెట్ చౌరస్తాలో మహాధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. ఉద్యమకారుల వివరాల నమోదు కోసం ప్రభుత్వం వెంటనే ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. అలాగే 100 ఎకరాల్లో అమరవీరుల స్మృతివనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో యాప్‌ను ప్రారంభించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ధర్నాలో టీయూజేఏసీ నాయకులు అన్వర్ పటేల్, మోత్కూరు మల్లేష్, బి.ఎన్. జాంబవ్, ఆలకుంట కృష్ణ, రాజు గౌడ్, ఐలయ్య, జి. యాదగిరి, శ్రీశైలం చారి, రవీంద్ర చారి, బండ నర్సింగ్, అంకం సతీష్, అమర్, కొప్పుల కృష్ణ, లావణ్య, అరుణ, వెంకట్ లక్ష్మి, విజయ లక్ష్మి, శ్రీలత, వెంకటేష్, పెంటయ్య, సుశీల, పుట్ట విజయ, రేణుక, కమల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు నినాదాలు చేస్తూ ఉద్యమ గీతాలు ఆలపించారు.

మూడోసారి మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా కర్ర సత్యప్రసన్న రెడ్డి

- అబ్దుల్ రహమాన్ శుభాకాంక్షలు



కరీంనగర్, నవంబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కర్ర సత్యప్రసన్న రెడ్డి మూడోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ అసెంబ్లీ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.2002లో యూత్ కాంగ్రెస్ సభ్యురాలిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సత్యప్రసన్న రెడ్డి, 2013లో గోపాల్‌రావుపేట ఎంపీటీసీగా, 2018లో గ్రామ సర్పంచ్‌గా జనరల్ స్థానాల్లో విజయం సాధించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా, రాజీవ్ గాంధీ పంచాయతీ సంఘటన్ జిల్లా అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వహించారు.2021 నుంచి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న ఆమెకు పార్టీ పట్ల నిబద్ధత, సేవలను గుర్తించి అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించిందని అబ్దుల్ రహమాన్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, పార్టీకి సేవలందించాలని ఆకాంక్షించారు.

బ్లడ్ క్యాన్సర్ చిన్నారికి రక్తదానంతో అండగా సురేష్ ఇడపాక

- చిన్నారి కత్తి ఐరా (సమేరా) కోసం 22వసారి రక్తదానం
- ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని సందేశం



ఉప్పల్, నవంబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్): బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుస్తూ సామాజిక కార్యకర్త, జర్నలిస్టు సురేష్ ఇడపాక మానవత్వాన్ని చాటుకున్నారు. లక్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి తెలుసుకుని స్పందించారు. చిన్నారి చికిత్సకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో నవంబర్ 10న బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇది ఆయన జీవితంలో 22వసారి రక్తదానం కావడం విశేషం.**రక్తదానం.. ప్రాణదానంతో సమానం**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.రక్తదానం కేవలం దానం కాదు.. ఒక ప్రాణానికి ఇచ్చే జీవన భరోసా. మన రక్తం మరొకరి జీవితంలో ఆశాదీపం కావాలి.

అన్నవరం పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు

కరపత్రాలు విడుదల చేసిన డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ

ఒక ఫోన్ కాల్‌తో అన్నవరం, పంచారామాల బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం



సత్తుపల్లి, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :కార్తీక మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం సత్తుపల్లి డిపో నుండి అన్నవరం, పంచారామాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక మాసంలో ఏర్పాటు చేసిన స్పెషల్ బస్సులకు సంబంధించి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి డిపో నుండి ఈనెల 15, 22, 29 తేదీలు మరియు డిసెంబర్ 6 తేదీలలో పంచారామాలకు, అన్నవరం కు ప్రతి ఆదివారం రాత్రి 10 గంటలకు బస్సులు బయలుదేరుతాయి అని అన్నారు. పంచారామాలకు పెద్దలకు చార్జీ 1480 రూపాయలు పిల్లలకు చార్జీ 780 రూపాయలు గా నిర్ణయించినట్లు ఆయన వివరించారు. అన్నవరం కు చార్జి పెద్దలకు 610 పిల్లలకు 350 రూపాయల గా నిర్ణయించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం పంచారామాలకు 95820 సర్వీస్ నెంబర్ తో మరియు అన్నవరంకు 98000 సర్వీస్ నెంబర్ తో ఆన్లైన్ సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 23వ తేదీ సోమవారం రాత్రి ప్రత్యేక డీలక్స్ బస్సు అన్నవరం, పంచారామాలకు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9866619189,703218 2456,9959225962,9959225990 సంప్రదించవచ్చును అని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ ఎస్ సాహితి, స్టేషన్ మేనేజర్ జాలాది ఆనందం, జాకబ్, మస్తాన్ బి, హుస్సేన్ , శివకోటి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ భారీ ధర్నా

- ఉద్యమకారులకు ప్రత్యేక యాప్‌ను వెంటనే విడుదల చేయాలి
- వారంలోగా స్పందించకుంటే ఉద్యమం తీవ్రతరం: జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి హెచ్చరిక





హైదరాబాద్ నవంబర్ 10(పి సి డబ్ల్యూ న్యూస్):తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) మల్కాజిగిరి నియోజకవర్గం ఆధ్వర్యంలో మంగళవారం నేరెడ్‌మెట్ చౌరస్తా వద్ద మహాధర్నా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యమకారుల కోసం ప్రత్యేక యాప్‌ను తక్షణమే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలం, నెలకు 25 వేల రూపాయల గౌరవ వేతనం, అధికారిక గుర్తింపు కార్డు ఇవ్వాలని, అలాగే 100 ఎకరాలలో 'అమరుల స్మృతి వనం' ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాబోయే వారం రోజుల్లో ఉద్యమకారుల యాప్‌ను తీసుకురాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ధర్నా సమయంలో ఉద్యమకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ, ఉద్యమ గీతాలు ఆలపించి పరిసర ప్రాంతాలను హోరెత్తించారు.ఈ ధర్నాలో జేఏసీ నాయకులు అన్వర్ పటేల్, మోత్కూరు మల్లేష్, బి.ఎన్. జాంబవ్, ఆలకుంట కృష్ణ, రాజు గౌడ్, ఐలయ్య, జి. యాదగిరి, శ్రీశైలం చారి, రవీంద్ర చారి, బండ నర్సింగ్, అంకం సతీష్, అమర్, కొప్పుల కృష్ణ, లావణ్య, వి. అరుణ, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీలత, వెంకటేష్, పెంటయ్య, పి. సుశీల, ఏ. సుశీల, పుట్ట విజయ, రేణుక, పి. కమల మరియు పెద్ద సంఖ్యలో తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

రాజ్యసభలో ఎవరుంటారు?

- చైర్మన్‌గా ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు?

ఢిల్లీ టూర్‌లో మీరు ఏం నేర్చుకున్నారు?

శ్రీ ప్రతిభ విద్యార్థులతో ముచ్చటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్ నవంబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను ఈరోజు ఉదయం కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయం వద్ద జగిత్యాల జిల్లా మల్యాల చౌరస్తాలోని శ్రీ ప్రతిభ స్కూల్ విద్యార్థులు కలిశారు. ఇటీవల ఈ విద్యార్థులంతా ఢిల్లీ, ఆగ్రా టూర్ వెళ్లొచ్చారు. ఈ పర్యటనలో భోజన, వసతి, రవాణా సౌకర్యాలను కేంద్ర మంత్రి బండి సంజయ్ కల్పించారు. పార్లమెంట్, ప్రధానమంత్రి సంగ్రాలయం, ఆగ్రా వంటి అనేక చారిత్రాక ప్రదేశాలకు పంపించారు. తమ టూర్ విజయవంతంగా ముగించుకుని వచ్చిన ఆయా విద్యార్థులు ఈరోజు కేంద్ర మంత్రిని కలిశారు. "మీ వల్లే మా టూర్ విజయవంతమైంది. మీ సహకారంతో పార్లమెంట్, ప్రధానమంత్రి సంగ్రాలయం సహా అనేక చారిత్రాక ప్రదేశాలను చూడగలిగాం"అని పేర్కొంటూ క్రుతజతలు తెలియజేశారు. ఢిల్లీ పర్యటనలో ఏమైనా లోటుపాట్లున్నాయా? అని ఆయా విద్యార్థులను కేంద్ర మంత్రి ఆరా తీశారు. ఎలాంటి లోటుపాట్లు లేవని, భోజన, వసతి, రవాణ సౌకర్యాలన్నీ అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ టూర్ సందర్భంగా మీరేం నేర్చుకున్నారు? పార్లమెంట్ లో రాజ్యసభను చూశారా? ఆ సభకు ఎవరు వెళతారు? ఆ సభకు ఛైర్మన్ గా ఎవరు ప్రాతినిధ్యం వహిస్తారు? ప్రధానమంత్రి సంగ్రాలయ వెళ్లారా? అక్కడ మిమ్ముల్ని ఆకర్షించేమిటి? ప్రధానితో ఫోటో దిగారా? అంటూ ప్రశ్నలు వేశారు. వాటికి విద్యార్థులు నవ్వుతూ సమాధానాలిచ్చారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మీరంతా కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అక్కడున్న ఓ విద్యార్థి "ఢిల్లీలో మీ ఇల్లు చాలా బాగుంది." అని చెప్పడంతో కేంద్ర మంత్రి స్పందిస్తూ "మీ తల్లిదండ్రులంతా ఓటేసి గెలిపించడంవల్లే నేను ఎంపీనయ్యాను. మోదీగారు నన్ను కేంద్ర మంత్రిని చేయడంవల్లే అట్లాంటి అధికారిక నివాసంలోకి వెళ్లగలిగాను. మీరు కూడా కష్టపడి ప్రజలకు నిజాయితీగా సేవ చేస్తే పెద్దయ్యాక ఎంపీ అయ్యే అవకాశాలున్నాయి. ముఖ్యంగా మహిళలకు రాబోయే రోజుల్లో చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను మోదీగారు కల్పించబోతున్నారు. ఇక్కడున్న అమ్మాయిలంతా కష్టపడి చదువుకుని ప్రజలకు సేవ చేస్తే ఎంపీ సీట్లు కూడా దక్కే అవకాశాలున్నాయి."ని చెప్పారు.

కిట్స్ వరంగల్ పీఈడీ విభాగాధిపతి డా. ఎం. శ్రీనివాస్ రెడ్డికి ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారం



వరంగల్, నవంబర్ (పిసీడబ్ల్యూ న్యూస్): కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) వరంగల్‌లో శారీరక విద్య (పీఈడీ) విభాగాధిపతిగా, సహాయ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న డా. ఎం. శ్రీనివాస్ రెడ్డికి ప్రతిష్టాత్మక డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం2026 లభించింది. హైదరాబాద్‌కు చెందిన శిక్షా ఇండియా ఫౌండేషన్, ఖేలో ఇండియా, స్కిల్ ఇండియా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పురస్కారాన్ని అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి తెలిపారు.సమాజ అభివృద్ధి, దేశ ప్రగతికి ఆయన అందించిన విశేష సేవలు, అంకితభావం, నాయకత్వ లక్షణాలు, విద్యారంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.శారీరక విద్య రంగంలో 26 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన డా. శ్రీనివాస్ రెడ్డి యువత అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. కిట్స్ వరంగల్‌లో క్రీడా మౌలిక సదుపాయాల ఆధునీకరణతో పాటు పరిశోధన, విద్యా ప్రమాణాల పెంపునకు విస్తృత కార్యక్రమాలు చేపట్టారు. ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి మార్గదర్శకత్వంలో పరిశోధన రంగంలోనూ విశేష ప్రతిభ కనబరుస్తున్నారు.ఈ సందర్భంగా కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు, కోశాధికారి పి. నారాయణ రెడ్డి, అదనపు కార్యదర్శి, హన్మకొండ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక రెడ్డి డా. శ్రీనివాస్ రెడ్డిని అభినందించారు.అలాగే రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, పరిపాలనా అధికారి ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్వో డా. డి. ప్రభాకర చారి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, కళాశాల శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలియజేస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

అడుగడుగునా మృత్యువు గుంతలు

- అస్తవ్యస్తంగా రహదారి
- కల్లూరు మధిర మార్గంలో ప్రయాణమంటే ప్రాణసంకటమే
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికుల డిమాండ్







కల్లూరు, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) :కల్లూరు నుంచి మధిర వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడి రహదారి పూర్తిగా అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ ప్రమాదం పొంచి ఉందో తెలియని దుస్థితి నెలకొంది.**ప్రమాదాలు జరుగుతున్నా స్పందన ఏదీ?**ఈ రహదారిపై ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు జరిగి పలువురు వాహనదారులు తీవ్రంగా గాయపడిన ఘటనలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు కాళ్లు, చేతులు విరిగి ఆసుపత్రుల పాలవుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నా కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. **రాత్రివేళ ప్రయాణమంటేనే భయం!** ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు సరిగా కనిపించకపోవడంతో చిన్నపాటి ఏమరుపాటు జరిగినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. వాహనాలు దెబ్బతినడంతో పాటు ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని వాపోతున్నారు.

మరో ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?ప్రజలు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రహదారులను నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై లేదా ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు ఎందుకు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వందల సంఖ్యలో గుంతలు ఏర్పడినా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు.

తక్షణమే శాశ్వత మరమ్మతులు చేపట్టాలి!ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి కల్లూరు, మధిర ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యతా ప్రమాణాలతో శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రయాణికు లకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు కావాల్సింది హామీలు కాదు.. సురక్షిత ప్రయాణానికి భరోసా అని, మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కరీంనగర్‌లో త్వరలో బీజేపీ భారీ మహా పాదయాత్ర...

- లక్ష మందితో పాదయాత్ర

నిర్వహణకు బండి సంజయ్ సన్నాహాలు

- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్

నబిన్ ముఖ్య అతిథిగా హాజరు



కరీంనగర్,నవంబర్10(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లో త్వరలో నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రను చారిత్రాత్మకంగా నిలిపేందుకు పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆయన తొలి కరీంనగర్ పర్యటనను పురస్కరించుకుని కనీసం లక్ష మందితో భారీ ర్యాలీ నిర్వహించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ లక్ష్యంగా పెట్టుకున్నారు.గాంధీ సర్కిల్‌లోని వైశ్య భవన్ నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్ర టవర్ సర్కిల్ మీదుగా కవర్ చేస్తూ కమాన్ వరకు కొనసాగనుంది. ఈ కార్యక్రమంలో నితిన్ నబిన్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, బండి సంజయ్ పాల్గొననున్నారు.పాదయాత్ర ఏర్పాట్లపై చర్చించేందుకు బండి సంజయ్ ఎంపీ కార్యాలయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన సమీకరణ, రూట్ ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాలపై నేతలతో సమీక్షించారు.సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ ఎన్నికల సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు వివరించడంతో పాటు వాస్తవాలను తెలియజేయడమే మహా పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా పోలింగ్ బూత్ స్థాయి నుంచి శక్తి కేంద్రాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నాయకులకు సూచించారు. మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా పాదయాత్రకు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు.ఈ సమావేశంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపీ, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ, గంగాడి కృష్ణారెడ్డి, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రాణం కోసం రక్తదానం.. మానవత్వాన్ని చాటిన నెమ్మాది వెంకన్న

- **బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుపు**
- **16వసారి రక్తదానం చేసి సేవాభావం చాటుకున్న సామాజిక కార్యకర్త**



ఉప్పల్, నవంబర్ 10(పి సి డబ్ల్యూ న్యూస్): బ్లడ్ క్యాన్సర్‌తో పోరాడుతున్న చిన్నారి కత్తి ఐరా (సమేరా)కు అండగా నిలుస్తూ సామాజిక కార్యకర్త నెమ్మాది వెంకన్న మానవత్వాన్ని చాటుకున్నారు. లడ్డీకాపూల్‌లోని ఎం.ఎన్.జే. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పరిస్థితి తెలుసుకుని స్పందించారు. చిన్నారి చికిత్సకు తనవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో నవంబర్ 10న బర్కత్‌పురాలోని జాగృతి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఇది ఆయన జీవితంలో 16వసారి రక్తదానం కావడం విశేషం.**ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి**ఈ సందర్భంగా నెమ్మాది వెంకన్న మాట్లాడుతూ, అత్యవసర సమయంలో మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం మరొకరి ప్రాణాలను కాపాడటమే కాకుండా, ఆ కుటుంబానికి కొత్త ఆశను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.రక్తదానం కేవలం దానం కాదు.. ఒక ప్రాణానికి ఇచ్చే జీవన భరోసా. మన రక్తం మరొకరి జీవితంలో ఆశాదీపం కావాలి.

మానవ సేవే మాధవ సేవగా ఉచిత వైద్య, సామాజిక సేవలు

అంబర్‌పేట హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, శిక్షణ కార్యక్రమాలు

పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం: రాజేందర్‌పటేల్ గౌడ్



హైదరాబాద్ , నవంబర్ 10(పిసిడబ్ల్యూ న్యూస్): మానవ సేవే మాధవ సేవ భావనతో పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు అంబర్‌పేట హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హిందూ శ్మశాన వాటిక నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక హూరాస్‌పేంట్ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ప్రాంగణంలో నిరుపేదల సంక్షేమం కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆధునిక పరికరాలతో బీపీ (రక్తపోటు), షుగర్ (మధుమేహం) వంటి సాధారణ వైద్య పరీక్షలతో పాటు జనరల్ చెకప్‌లను అనుభవజ్ఞులైన నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఉచితంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరం ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. **ఉచిత శిక్షణ కేంద్రాలు:**వైద్య సేవలకే పరిమితం కాకుండా, సమాజంలో మహిళలు, పేదల ఆర్థిక వికాసానికి ట్రస్ట్ బోర్డు తరఫున లక్షలాది రూపాయల ఖర్చుతో పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా: ఉచిత యోగా శిక్షణ సెంటర్ మహిళలకు స్వయం ఉపాధి కల్పించే కుట్టు శిక్షణ (టైలరింగ్) ఉచిత మెహిందీ డిజైనింగ్ శిక్షణ వంటి పలు కోర్సులను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుత కాలంలో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడం ఎంతో సవాలుతో కూడుకున్న విషయమని, అయినప్పటికీ ప్రజలకు సేవ చేయడంలో లభించే ఆత్మతృప్తి మరెందులోనూ లభించదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ అరుదైన అవకాశాన్ని కాచిగూడ మరియు పరిసర ప్రాంతాలలోని పేద ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

దాసోజు లక్ష్మమ్మ చిత్రపటానికి ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఘన నివాళి

- డా. బి.వి. చారి కుటుంబానికి పరామర్శ ప్రగాఢ సానుభూతి



ఉప్పల్ నవంబర్ 10(పి సి డబ్ల్యూ న్యూస్):హబ్సిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు డా. బి.వి. చారి అత్త దాసోజు లక్ష్మమ్మ ఇటీవల పరమపదించిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వారి నివాసానికి విచ్చేసి లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డా. బి.వి. చారి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.లక్ష్మమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

అన్నదాన సేవతో మేయర్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు



కరీంనగర్, నవంబర్ 10 (పీసీడబ్ల్యూ న్యూస్):కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌స్వర్ణలత దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కరీంనగర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర టెంపుల్ చౌరస్తాలో, గౌరిశెట్టి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, వారి బంధువులకు మేయర్ దంపతులు అన్నదానం చేశారు.అనంతరం ఆయా సంస్థల నిర్వాహకులు మేయర్ దంపతులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తీగలగుట్టపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పలువురు పాలకవర్గ సభ్యులు పాల్గొని పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

మల్లంపల్లికి మండల హోదా వచ్చి రెండేళ్లయినా..

వైద్య సదుపాయాలు ఏవీ?

తక్షణమే ఆసుపత్రి, అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

మల్లంపల్లి బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ డిమాండ్



మల్లంపల్లి, నవంబర్ 10 (పి.సి.డబ్ల్యూ న్యూస్): మల్లంపల్లి మండల ప్రజలకు తక్షణమే పూర్తిస్థాయి వైద్య సదుపాయాలు కల్పించాలని బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంగా ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు కనీస వైద్య సదుపాయాలు అందుబాటులోకి రాకపోవడం బాధాకరమన్నారు. మల్లంపల్లి మండలాన్ని 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాథమిక గెజిట్ ద్వారా ప్రకటించిందని, అనంతరం 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం తుది గెజిట్ ద్వారా మండలాన్ని ఏర్పాటు చేసిందని ఆయన గుర్తుచేశారు. మండల హోదా వచ్చి ఇంతకాలం గడిచినా ఇప్పటికీ ఆసుపత్రి, అంబులెన్స్ వంటి అత్యవసర వైద్య సదుపాయాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం మల్లంపల్లి ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమయానికి వైద్యం అందక ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మండల హోదా మాత్రమే కాకుండా ప్రజల ప్రాణాలను కాపాడే అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో ఉండాలని అన్నారు. మల్లంపల్లి మండల కేంద్రంలో తక్షణమే పూర్తిస్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు శాశ్వత ఆసుపత్రి భవనం, అవసరమైన వైద్య సిబ్బంది, 24 గంటల వైద్య సేవలు, అత్యవసర అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని చీదర సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- **నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి**
- **టూరిజం నోడల్ అధికారి డా. ఏ. ధర్మ నాయక్**



ములుగు జిల్లా, నవంబర్ 10 (పి సి డబ్ల్యూ న్యూస్):రామప్ప సరస్సులోని ఐలాండ్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని టూరిజం నోడల్ అధికారి డా. ఏ. ధర్మ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన రామప్ప సరస్సు ఐలాండ్‌ను సందర్శించి అక్కడ కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఐలాండ్‌లో చేపడుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జరుగుతున్న పనుల నాణ్యతను స్వయంగా పరిశీలించి, నిర్మాణాల్లో ఎక్కడా నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. పర్యాటకుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పనులను చేపట్టాలని తెలిపారు.పెండింగ్‌లో ఉన్న పనులను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రామప్పకు వచ్చే పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా ఐలాండ్ అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టూరిజం ఏఈ విజయ్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపులి రాజకీయాలు కాదు.. ప్రజా క్షేమ పాలన కావాలి!

- ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి బత్తోజు ద్రోణాచార్య



జేడీ మల్లంపల్లి నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్): రాజకీయ విమర్శలు, వ్యక్తిగత విమర్శలను పక్కనపెట్టి ప్రజల కనీస అవసరాలపై పాలకులు దృష్టి సారించాలని బీఆర్ఎస్ రాష్ట్ర బీసీ సెల్ నాయకులు బత్తోజు ద్రోణాచార్య అన్నారు. తెలంగాణ ప్రజలు తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ విమర్శలతో కాలక్షేపం చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రజలకు గుక్కెడు తాగునీరు అందించలేని పరిస్థితుల్లో కేటీఆర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాజకీయ ప్రసంగాలు, మాటల గారడీతో ప్రజల సమస్యలు పరిష్కారం కావని, తాగునీరు, సంక్షేమం, అభివృద్ధి వంటి మౌలిక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు .ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు వ్యక్తిగత విమర్శలకు దిగడం మానుకోవాలని హితవు పలికారు. నక్కకు పులి వాతలు పెట్టినంత మాత్రాన పులి కాలేదని, అలాగే పెద్దపెద్ద మాటలు మాట్లాడినంత మాత్రాన నాయకులు కాలేరని విమర్శించారు. తెలంగాణ ప్రజలకు కావాల్సింది నక్కపులి రాజకీయాలు కాదని, ప్రజల అవసరాలను గుర్తించి పరిష్కరించే బాధ్యతాయుతమైన ప్రజా క్షేమ పాలన అని బత్తోజు ద్రోణాచార్య స్పష్టం చేశారు.

సంపాదకీయం



ట్రంప్‌పై మహిళాగ్రహం.. అమెరికా రాజకీయాల్లో పెను మార్పు!

- మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లకు మహిళల భారీ మద్దతు..
ఆర్థిక భారాలు, హక్కులపై ఆంక్షలే అసంతృప్తికి కారణం

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ సాధించిన విజయాల్లో మహిళా ఓటర్ల పాత్ర అత్యంత కీలకంగా నిలిచింది. ఎన్నికల అనంతరం వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ ప్రకారం 61 శాతం మంది మహిళలు డెమోక్రటిక్ పార్టీకి మద్దతుగా ఓటు వేయగా, 38 శాతం మంది మాత్రమే రిపబ్లికన్ పార్టీకి మద్దతు పలికారు. 2024 అధ్యక్ష ఎన్నికలతో పోలిస్తే మహిళల్లో డెమోక్రటిక్ పార్టీకి మద్దతు 13 శాతం పాయింట్లు పెరగడం గమనార్హం. మొత్తం ఓటర్లలో మహిళల వాటా 53 శాతంగా ఉండటంతో ఈ ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయడంలో వారు కీలక పాత్ర పోషించారు.**జీవన వ్యయాల పెరుగుదలతో ఆగ్రహం**ట్రంప్ ప్రభుత్వంపై మహిళల్లో అసంతృప్తి పెరగడానికి ప్రధాన కారణం పెరుగుతున్న జీవన వ్యయం. నిత్యావసర వస్తువుల ధరలు, ఇంధన ఖర్చులు, రవాణా వ్యయాలు పెరగడంతో సామాన్య కుటుంబాలపై ఆర్థిక భారం అధికమైంది. ముఖ్యంగా కుటుంబ అవసరాలను తీర్చే బాధ్యతను ఎక్కువగా మోస్తున్న మహిళలు ఈ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమెరికా కార్మిక శాఖ గణాంకాల ప్రకారం వార్షిక ద్రవ్యోల్బణం ఆగస్టులో 3.4 శాతంగా ఉండగా, సెప్టెంబరులో 3.7 శాతానికి పెరిగింది. ఈ ధరల పెరుగుదల మహిళల ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.పురుషులతో పోలిస్తే మహిళల సగటు ఆదాయం, పొదుపులు తక్కువగా ఉండటంతో నిత్యావసరాల కోసం తమ సంపాదనలో అధిక భాగాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దేందుకు మహిళలు తమ వ్యక్తిగత అవసరాలను సైతం పక్కనపెడుతున్నారు. గతంలో చోటుచేసుకున్న ఆర్థిక సంక్షోభాలను పరిశీలించినా పెరుగుతున్న ఖర్చుల ప్రభావం మొదటగా మహిళలపైనే పడినట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ధరల నియంత్రణలో ట్రంప్ ప్రభుత్వం విఫలమైందనే అభిప్రాయం మహిళల్లో బలపడింది.**మహిళల హక్కులపై ఆంక్షలు**ఆర్థిక సమస్యలతో పాటు మహిళల వ్యక్తిగత స్వేచ్ఛ, ఆరోగ్య హక్కులకు సంబంధించిన అంశాలు కూడా ట్రంప్ ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచాయి. కృత్రిమ గర్భధారణ ద్వారా సంతానం పొందేందుకు అందించే వైద్య చికిత్సలపై పరిమితులు, అబార్షన్ సేవలపై ఆంక్షలు మహిళల్లో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. మహిళల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కార్యక్రమాలకు నిధులు నిలిపివేయడం, కుటుంబ నియంత్రణ సేవలను పరిమితం చేయడం వంటి చర్యలు కూడా విమర్శలకు దారితీశాయి.అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థను రద్దు చేయడంతో పాటు కుటుంబ నియంత్రణ కార్యక్రమాలకు నిధులు నిలిపివేయడం వల్ల అనేక ఆరోగ్య సేవలు ప్రభావితమయ్యాయి. ఈ చర్యల కారణంగా తమ పరిధిలోని సుమారు 1,400 ఆరోగ్య కేంద్రాలు మూతపడాల్సి వచ్చిందని ఇంటర్నేషనల్ ప్లాన్డ్ పేరెంట్‌హుడ్ సమాఖ్య డైరెక్టర్ జనరల్ అల్ముడ్డే కాస్ట్రో వెల్లడించారు. మహిళలకు అవసరమైన ఆరోగ్య సేవలు అందుబాటులో లేకపోవడం వారి ఆగ్రహాన్ని మరింత పెంచింది. మహిళల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ గట్టిగా నిలబడాలని, మిగిలిన నిధులను కాపాడాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.**వివిధ సామాజిక వర్గాల మహిళల మద్దతు**ఈ ఎన్నికల్లో వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు డెమోక్రటిక్ పార్టీకి పెద్దఎత్తున మద్దతు ఇచ్చారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన అభిప్రాయ సేకరణలో 56 శాతం మంది మహిళలు డెమోక్రటిక్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించగా, 37 శాతం మంది రిపబ్లికన్ అభ్యర్థులకు అనుకూలంగా ఉన్నారు. ముఖ్యంగా నల్లజాతి మహిళల్లో డెమోక్రటిక్ పార్టీకి అత్యధిక మద్దతు లభించింది. వీరిలో 93 శాతం మంది డెమోక్రటిక్ అభ్యర్థులకు ఓటు వేయగా, కేవలం 6 శాతం మంది మాత్రమే రిపబ్లికన్ అభ్యర్థులకు మద్దతు పలికారు.లాటినో, హిస్పానిక్ మహిళలు కూడా డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపారు. లాటినో మహిళల్లో 68 శాతం మంది, హిస్పానిక్ మహిళల్లో 74 శాతం మంది డెమోక్రటిక్ అభ్యర్థులకు ఓటు వేసినట్లు అంచనాలు వెల్లడించాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈ వర్గాల్లో డెమోక్రటిక్ పార్టీకి మద్దతు పెరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.**ఉన్నత పదవుల్లో మహిళల చారిత్రక విజయాలు**ఈ ఎన్నికల్లో మహిళలు ఓటర్లుగా మాత్రమే కాకుండా అభ్యర్థులుగా కూడా తమ సత్తా చాటారు. న్యూమెక్సికోలో డెట్ హోలాండ్ రాష్ట్ర గవర్నర్‌గా ఎన్నికైన తొలి స్థానిక అమెరికన్ మహిళగా చరిత్ర సృష్టించారు. జార్జియాలో విజయం సాధించిన కీషా లాన్స్ బాటమ్స్ గవర్నర్‌గా ఎన్నికైన తొలి నల్లజాతి మహిళగా రికార్డు నెలకొల్పారు. ఇల్లినాయిస్ రాష్ట్రం ఒకేసారి ఇద్దరు నల్లజాతి మహిళా ప్రతినిధులను అమెరికా సెనేట్‌కు పంపిన రాష్ట్రంగా నిలిచింది.దశాబ్దాలుగా సంప్రదాయవాద రాజకీయ ఆధిపత్యం కొనసాగిన కొన్ని రాష్ట్రాలు కూడా తొలిసారిగా మహిళా గవర్నర్లను ఎన్నుకోవడం విశేషం. జార్జియా, మిన్నెసోటా, టెన్నెస్సీ, ఒహియో రాష్ట్రాల్లో మహిళలు గవర్నర్లుగా ఎన్నికయ్యారు. అమెరికా ప్రతినిధుల సభలో ఒకేసారి కనీసం 100 మంది మహిళలు సభ్యులుగా ఉండే పరిస్థితి ఏర్పడనుందని అంచనాలు వెల్లడించాయి.**ట్రంప్‌కు మహిళల హెచ్చరిక!**మొత్తంగా అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు మహిళా ఓటర్ల రాజకీయ ప్రాధాన్యతను మరోసారి చాటిచెప్పాయి. ధరల పెరుగుదల, కుటుంబ ఆర్థిక భారం, ఆరోగ్య సేవల కొరత, మహిళల హక్కులపై ఆంక్షలు వంటి అంశాలు ఎన్నికల్లో కీలక ప్రభావం చూపాయి. మహిళల సమస్యలను విస్మరించే ప్రభుత్వాలకు ప్రజాస్వామ్యంలో తగిన సమాధానం ఎదురవుతుందని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. మహిళల అసంతృప్తిని కేవలం ఎన్నికల నినాదంగా చూడకుండా వారి సమస్యలకు పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉంది. మహిళల మద్దతు లేకుండా రాజకీయ విజయాలు సాధించడం ఎంత కష్టమో ట్రంప్‌కు ఈ ఎన్నికలు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చాయి. రానున్న రోజుల్లో అమెరికా రాజకీయాలు మహిళల హక్కులు, ఆర్థిక భద్రత, సమాన అవకాశాల చుట్టూ మరింతగా తిరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కేజీబీవీ జాతీయస్థాయి క్రీడాకారునికి ఘన సన్మానం





- ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఢిల్లీ రగ్బీ పోటీల్లో సత్తాచాటిన సునీతకు ఘన సన్మానం

- ప్రతిభకు పేదరికం అడ్డుకాకుండా ప్రోత్సహించిన గురువులు, ఆర్థికంగా అండగా నిలిచిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు

- చదువుతోపాటు క్రీడల్లోనూ కేజీబీవీ బాలికలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు : స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర





ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 10 (పిసిడబ్ల్యూ న్యూస్) : పేదరికం ప్రతిభకు అడ్డుకాదని, సరైన ప్రోత్సాహం, పట్టుదల, గురువుల సహకారం తోడైతే మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన బాలికలు సైతం జాతీయ, అంతర్జాతీయ వేదికలపై విజయకేతనం ఎగురవేయగలరని న్యూ లక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థిని బి. సునీత నిరూపించింది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని పాఠశాలకు తిరిగి వచ్చిన సునీతకు ఉపాధ్యాయులు, సహచర విద్యార్థినులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. పూలు చల్లి, శాలువాలు కప్పి అభినందనలతో ముంచెత్తారు.అక్టోబర్ 31 నుంచి నవంబర్ 5 వరకు ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొని మంగళవారం పాఠశాలకు చేరుకున్న సునీతను స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర, రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ రఘు, పీఈటీ సునీత, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ ఇందిర మాట్లాడుతూ.. కేజీబీవీ పాఠశాలల్లో చదువుతున్న పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, వారికి తగిన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే చదువుతోపాటు క్రీడల్లోనూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. తమ కన్నబిడ్డల్లా చూసుకుంటూ విద్యార్థినుల భవిష్యత్తుకు బాటలు వేయడం, వారిని ఉత్తమ క్రీడాకారిణులుగా తీర్చిదిద్దడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు.అక్టోబర్ 7న ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 రగ్బీ పోటీల్లో సునీత తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అనంతరం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హోమ్ స్కూల్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలికల రగ్బీ టోర్నమెంట్‌లోనూ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. అక్కడ కనబరిచిన ప్రతిభతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ఢిల్లీ వేదికగా తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అంతేకాకుండా కబడ్డీ క్రీడలోనూ అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని తన ప్రతిభను చాటుకోవడం విశేషమని ఇందిర కొనియాడారు.సునీత వంటి ప్రతిభావంతులైన బాలికలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ క్రీడా ప్రయాణాన్ని మధ్యలోనే ఆపకూడదనే సంకల్పంతో పాఠశాల పీఈటీ సునీత ప్రత్యేక చొరవ తీసుకోవడాన్ని స్పెషల్ ఆఫీసర్ ఇందిర అభినందించారు. విద్యార్థినుల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి, వారికి నిరంతరం శిక్షణ అందిస్తూ, ఖమ్మం, హైదరాబాద్ వంటి పట్టణాలకు వ్యక్తిగత భద్రతతో తీసుకువెళ్లి పోటీలకు సిద్ధం చేయడంలో ఆమె చేసిన కృషి అభినందనీయమన్నారు. అదేవిధంగా పాఠశాలకు వచ్చి పేద విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ అందించిన రగ్బీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోచ్ రఘు సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా పీఈటీ సునీత, కోచ్ రఘును శాలువాలతో ఘనంగా సన్మానించారు. మరోవైపు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లాల్సిన సమయంలో సునీత కుటుంబం ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి మానవతా దృక్పథంతో సహకరించిన విజయ అమృత్ కుమార్, రమణ ప్రసాద్, కావూరి అనంత్, మోహన్ దాస్, బెన్ని ప్రభుదాస్, సముద్రాల జగదీశ్‌లకు స్పెషల్ ఆఫీసర్ ఇందిర ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద విద్యార్థిని క్రీడా కల సాకారం కావడానికి ఆర్థికంగా అండగా నిలిచిన వారి ఔదార్యం అభినందనీయమని అన్నారు.

ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే ప్రతి చేయూత ఒక విద్యార్థిని భవిష్యత్తుకు వెలుగునిస్తుందని పేర్కొన్నారు.ఒకవైపు విద్యాబోధన, మరోవైపు క్రీడా శిక్షణతో బాలికల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న పాఠశాల అధ్యాపక బృందం, సిబ్బంది కృషి అభినందనీయమని పలువురు కొనియాడారు. పేదింటి బిడ్డల కలలకు గురువుల ప్రోత్సాహం, దాతల ఆపన్నహస్తం తోడైతే మరెంతోమంది సునీతలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరవగలరనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాంబశివరావు, చామంతుల శ్రీను, పరమేష్, రూప, పాఠశాల, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆత్మగీతం.. అందెశ్రీ అక్షరాల అమరత్వం!



తెలంగాణ అంటే ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదు.. అది ఒక చరిత్ర, సంస్కృతి, భాష, పోరాటం. ఆ పోరాటానికి తన కలంతో ఊపిరిపోసిన ప్రజాకవి అందెశ్రీ. ఆయన రచించిన 'జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం' గీతం తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.సాధారణ కుటుంబంలో జన్మించిన అందెశ్రీ ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ జీవిత అనుభవాలనే తన సాహిత్యానికి పునాదిగా చేసుకున్నారు. పెద్దగా చదువుకోకపోయినా ప్రజల జీవితాలను చదివారు. పేదల కష్టాలు, సామాజిక అసమానతలు, మానవ సంబంధాలు ఆయన రచనల్లో ప్రతిబింబించాయి.తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఆయన పాటలు ప్రజలకు గొప్ప స్ఫూర్తినిచ్చాయి. విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు ఆయన గీతాలను ఉద్యమ గొంతుకగా మార్చుకున్నారు. ముఖ్యంగా 'జయ జయహే తెలంగాణ' గీతం రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ గీతానికి అధికారిక రాష్ట్ర గీతంగా గుర్తింపు లభించడం విశేషం.అందెశ్రీ రచనలు కేవలం తెలంగాణ ఉద్యమానికే పరిమితం కాలేదు. మానవత్వం, సామాజిక న్యాయం, పేదరికం, కుల వివక్ష వంటి అంశాలను తన పాటల ద్వారా ప్రశ్నించారు. 'మాయమైపోతున్నదమ్మా మనిషన్నవాడు' వంటి గీతంతో మానవ విలువల ప్రాధాన్యతను చాటిచెప్పారు.తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో అందెశ్రీ సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుంది. ఆయన రచనలను పాఠ్యాంశాల్లో చేర్చడం, సాహిత్యాన్ని భద్రపరచడం, యువతకు పరిచయం చేయడం అవసరం.కవికి మరణం ఉండవచ్చు.. కానీ ఆయన సృష్టించిన అక్షరాలకు మరణం ఉండదు. తెలంగాణ నేల ఉన్నంతకాలం అందెశ్రీ పాటలు ప్రజల గుండెల్లో మార్మోగుతూనే ఉంటాయి. ఆయన సాహిత్యాన్ని గౌరవించడమే ఆ ప్రజాకవికి నిజమైన నివాళి.

యూఏఈపై యువ భారత్ ఘన విజయం

70 పరుగుల తేడాతో గెలుపు.. అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్‌కు అర్హత

ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసకర సెంచరీ..

నాలుగు వికెట్లతో చెలరేగిన ఇషాన్ సూద్



మస్కట్: అండర్-19 ఆసియా కప్-2026లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శనతో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో మంగళవారం జరిగిన కీలక మ్యాచ్‌లో 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించిన భారత్.. అనంతరం బౌలింగ్‌లోనూ ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఆర్యవీర్ సెహ్వాగ్ భారీ సెంచరీతో ఆకట్టుకోగా, బౌలర్ ఇషాన్ సూద్ నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. **ఆర్యవీర్ అద్భుత ఇన్నింగ్స్**టాస్ గెలిచిన యూఏఈ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత ఓపెనర్ ఆర్యవీర్ సెహ్వాగ్ ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 168 బంతుల్లో 160 పరుగులు సాధించి జట్టుకు భారీ స్కోరు అందించాడు. అతడి ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. మరోవైపు వీకే వినీత్ 69 బంతుల్లో 67 పరుగులతో అర్ధసెంచరీ సాధించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కెప్టెన్ లక్ష్య రాజేశ్ 17 పరుగులు చేయగా, యశ్‌బర్ధన్ చౌహాన్ 17 పరుగులతో రాణించాడు. చివర్లో మోహిత్ ఉల్వా, ఆర్యన్ సవ్సాని నాటౌట్‌గా నిలిచారు. దీంతో భారత్ 300 పరుగుల మార్కును దాటింది. **ఇషాన్ సూద్ బౌలింగ్ దెబ్బ**310 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. వరుసగా వికెట్లు కోల్పోతూ నిర్ణీత ఓవర్లలో 239 పరుగులకే ఆలౌటైంది. యూఏఈ బ్యాటర్ అహ్మద్ 74 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. నూరుల్లా ఆయోబి 39, యాయిన్ రాయ్ 29, అయాన్ 27 పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు.భారత బౌలర్ ఇషాన్ సూద్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు వికెట్లు పడగొట్టాడు. మోహిత్, మనాల్, కావ్య పటేల్, యశ్‌బర్ధన్, ఆర్యన్, అర్జున్ తలో వికెట్ సాధించారు. భారత బౌలర్లు సమష్టిగా రాణించడంతో యూఏఈ జట్టు లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. **సెమీస్‌లో అఫ్గానిస్థాన్‌తో పోరు**ఈ విజయంతో భారత యువ జట్టు అండర్-19 ఆసియా కప్ సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. బ్యాటింగ్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్ అసాధారణ ప్రదర్శన, బౌలింగ్‌లో ఇషాన్ సూద్ కీలక వికెట్లు భారత విజయానికి ప్రధాన కారణమయ్యాయి. టోర్నీలో టైటిల్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న భారత జట్టు సెమీఫైనల్‌లో అఫ్గానిస్థాన్‌తో తలపడనుంది. యువ ఆటగాళ్ల సమష్టి ప్రదర్శనతో భారత శిబిరంలో ఉత్సాహం నెలకొంది.

ఢిల్లీ క్యాపిటల్స్‌లో ట్రేడింగ్‌కు బ్రేక్!

- **అక్షర్ పటేల్, ఆశుతోష్ శర్మ జట్టులోనే..**
- **ఐపీఎల్-2027కు ముందు కీలక నిర్ణయం.. కెప్టెన్సీపై ఇంకా ఉత్కంఠ**



న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందు ఆటగాళ్ల బదిలీలపై జరుగుతున్న చర్చలకు ఢిల్లీ క్యాపిటల్స్ తెరదించింది. స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్, యువ బ్యాటర్ ఆశుతోష్ శర్మలను ఇతర జట్లకు ట్రేడ్ చేసే ఆలోచన లేదని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇప్పటికే తమ ట్రేడింగ్ ప్రక్రియను ముగించిన ఢిల్లీ క్యాపిటల్స్.. ఇకపై ఎలాంటి ఆటగాళ్ల మార్పిడులు చేపట్టబోమని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించినట్లు కథనాలు పేర్కొన్నాయి.**అక్షర్‌పై చెన్నై ఆసక్తి** గత కొన్ని రోజులుగా అక్షర్ పటేల్‌ను చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి తీసుకోనున్నట్లు ప్రచారం జరిగింది. అతడి ఆల్‌రౌండ్ నైపుణ్యాలు చెన్నై జట్టుకు ఉపయోగపడతాయని వార్తలు వచ్చాయి. మరోవైపు ఆశుతోష్ శర్మపై గుజరాత్ టైటాన్స్, లక్నో సూపర్ జెయింట్స్ ఆసక్తి చూపినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరినీ వదులుకునేందుకు ఢిల్లీ క్యాపిటల్స్ సిద్ధంగా లేదని తాజా పరిణామాలతో స్పష్టమైంది.**ఆటతో ఆకట్టుకున్న ఆటగాళ్లు** 2026 ఐపీఎల్ సీజన్‌లో అక్షర్ పటేల్ 14 మ్యాచ్‌ల్లో 173 పరుగులు చేయడంతో పాటు 11 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్, బ్యాటింగ్ రెండింటిలోనూ జట్టుకు ఉపయోగపడే ఆటగాడిగా గుర్తింపు పొందాడు. మరోవైపు ఆశుతోష్ శర్మ ఎనిమిది మ్యాచ్‌ల్లో 171 పరుగులు సాధించాడు. 181.91 స్ట్రైక్‌రేట్‌తో వేగంగా పరుగులు సాధిస్తూ ఫినిషర్‌గా తన సత్తా చాటాడు. ఈ ప్రదర్శనల నేపథ్యంలో ఇద్దరినీ జట్టులో కొనసాగించాలని ఢిల్లీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

వర్షార్పణమైన మూడో వన్డే

- ఒక్క బంతి కూడా పడకుండానే రద్దు.. 2-0తో భారత్ ఆధిక్యం




హామిల్టన్: భారత్-న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. మంగళవారం హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్ వేదికగా జరగాల్సిన ఈ మ్యాచ్‌లో ఒక్క బంతి కూడా పడలేదు. వరుసగా కురిసిన వర్షంతో మైదానం ఆటకు అనుకూలంగా లేకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యాన్ని కొనసాగించింది.టాస్ ఆలస్యంగా జరగ్గా, భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వర్షం కారణంగా మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించినప్పటికీ ఆట ప్రారంభానికి మరోసారి అంతరాయం ఏర్పడింది. అంపైర్లు పలుమార్లు మైదానాన్ని పరిశీలించినా పరిస్థితులు అనుకూలించకపోవడంతో చివరకు మ్యాచ్‌ను రద్దు చేశారు.ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో భారత్ విజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఐదు వికెట్ల తేడాతో, రెండో వన్డేలో డక్‌వర్త్ లూయిస్ విధానంలో నాలుగు పరుగుల తేడాతో గెలుపొందింది. మూడో మ్యాచ్ రద్దు కావడంతో భారత్ సిరీస్ ఓటమి ప్రమాదం నుంచి బయటపడింది.సిరీస్‌లో నాలుగో వన్డే నవంబర్ 13న, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచి సిరీస్‌ను సమం చేయాలని న్యూజిలాండ్ భావిస్తుండగా, మిగిలిన మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని భారత్ పట్టుదలగా ఉంది.

ఐపీఎల్‌లో మరో రెండు కొత్త జట్లు!

2028 నుంచి 12 జట్లతో టోర్నీ నిర్వహణకు బీసీసీఐ కసరత్తు

రేసులో పుణె, వడోదర నగరాలు.. ఒక్కో జట్టు విలువ రూ.వేల కోట్లకు పైమాటే!



న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ఆదరణ కలిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మరింత విస్తరించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. 2028 సీజన్ నుంచి మరో రెండు కొత్త జట్లను ప్రవేశపెట్టి టోర్నీని 12 జట్లకు పెంచాలని యోచిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఈ కొత్త జట్ల కోసం మహారాష్ట్రలోని పుణె, గుజరాత్‌లోని వడోదర నగరాలు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదనపై ఇంకా ప్రాథమిక స్థాయిలోనే చర్చలు జరుగుతున్నాయని, తుది నిర్ణయం వెలువడాల్సి ఉందని సమాచారం. **పెట్టుబడులకు ఆసక్తి** ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణతో కొత్త జట్ల కొనుగోలుకు దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో కొత్త ఫ్రాంచైజీ విలువ ఒక బిలియన్ డాలర్లకు పైగా ఉండవచ్చని అంచనా. యూరప్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు, పశ్చిమాసియా సావరిన్ వెల్త్ ఫండ్లు, భారతీయ వ్యాపార సంస్థలు, అమెరికాకు చెందిన పెట్టుబడిదారులు కొత్త జట్లలో వాటాలు కొనుగోలు చేసేందుకు పరిశీలిస్తున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.**పుణెకు గతంలోనూ ఐపీఎల్ అనుబంధం**పుణె నగరానికి ఐపీఎల్‌తో గతంలోనూ అనుబంధం ఉంది. 2011 నుంచి 2013 వరకు పుణె వారియర్స్ ఇండియా జట్టు ఈ నగరానికి ప్రాతినిధ్యం వహించింది. ఆ తర్వాత 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ జట్టు బరిలోకి దిగింది. 2017లో ఫైనల్‌కు చేరిన ఆ జట్టు ముంబై ఇండియన్స్ చేతిలో ఒక్క పరుగు తేడాతో ఓటమి పాలైంది. దీంతో పుణెలో మళ్లీ ఐపీఎల్ జట్టు ఏర్పాటైతే క్రికెట్ అభిమానులకు మరింత ఉత్సాహం కలగనుంది.**వడోదరకు కొత్త అవకాశం** గుజరాత్‌లోని వడోదర కూడా కొత్త ఐపీఎల్ జట్టు కోసం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే అహ్మదాబాద్ కేంద్రంగా గుజరాత్ టైటాన్స్ జట్టు కొనసాగుతోంది. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో వడోదరను మరో క్రికెట్ కేంద్రంగా తీర్చిదిద్దే అవకాశాలున్నాయి. ఈ నగరంలో ఐపీఎల్ జట్టు ఏర్పాటైతే గుజరాత్‌లో క్రికెట్‌కు మరింత ప్రాధాన్యత పెరగనుంది.**భారీగా పెరిగిన ఐపీఎల్ జట్ల విలువ** ఇటీవల ఐపీఎల్ జట్ల యాజమాన్య మార్పులు, పెట్టుబడుల ఒప్పందాలు ఫ్రాంచైజీల విలువను భారీగా పెంచాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు విలువ 1.78 బిలియన్ డాలర్లుగా, రాజస్థాన్ రాయల్స్ విలువ 1.65 బిలియన్ డాలర్లుగా వార్తల్లో నిలిచాయి. గతంలో 2022 సీజన్‌కు ముందు లక్నో సూపర్‌జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ జట్లు ఐపీఎల్‌లోకి ప్రవేశం చాయి.**ప్రసార హక్కులపై కీలక నిర్ణయం**2023 నుంచి 2027 వరకు ఐపీఎల్ ప్రసార హక్కుల ద్వారా బీసీసీఐకి 6.2 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరింది. 2028 నుంచి ప్రారంభమయ్యే తదుపరి ప్రసార హక్కుల కాలంతో కొత్త జట్ల ప్రవేశాన్ని అనుసంధానించే అవకాశం ఉంది. అయితే అదనపు మ్యాచ్‌ల నిర్వహణ, ఆటగాళ్ల అందుబాటు, ప్రసార సంస్థల ఆసక్తి, వాణిజ్యపరమైన అంశాలను బీసీసీఐ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

సాండ్‌పేపర్ వివాదంపై స్టార్క్ స్పందన

ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఘటనపై పాత వైఖరికే కట్టుబడి ఉన్నా

ఖవాజా వ్యాఖ్యలతో మళ్లీ తెరపైకి వచ్చిన బాల్ ట్యాంపరింగ్ వివాదం



సిడ్నీ: ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఎనిమిదేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాల్ ట్యాంపరింగ్ (సాండ్‌పేపర్) వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. మాజీ క్రికెటర్ ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథ 'సబ్'లో చేసిన వ్యాఖ్యలపై ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ స్పందించాడు. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో బంతి ఆకారాన్ని మార్చేందుకు సాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటనపై తన అభిప్రాయంలో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశాడు.**ఖవాజా సంచలన ఆరోపణలు**2018లో కేప్‌టౌన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతిని ట్యాంపరింగ్ చేయడం ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర కలకలం రేపింది. అప్పట్లో కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై చర్యలు తీసుకున్నారు. అయితే ఈ ఘటనలో జట్టులోని పలువురికి ముందుగానే విషయం తెలుసని ఖవాజా తన పుస్తకంలో పేర్కొన్నాడు. కేవలం ముగ్గురిపైనే బాధ్యత మోపడం సరికాదని, జట్టు మొత్తం బాధ్యత వహించాల్సిందని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కేప్‌టౌన్ టెస్టుకు ముందు పోర్ట్ ఎలిజబెత్ టెస్టులోనూ బంతిని ట్యాంపరింగ్ చేశారని ఆరోపించాడు. **నా అభిప్రాయంలో మార్పులేదు: స్టార్క్**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన స్టార్క్.. ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఘటనపై తన జ్ఞాపకాలు, అభిప్రాయాలు మారలేదని తెలిపాడు. 2021లో తాము విడుదల చేసిన సంయుక్త ప్రకటనకే కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశాడు. మైదానంలో బంతిని మార్చేందుకు విదేశీ పదార్థాన్ని తీసుకెళ్లిన విషయం తమకు తెలియదని అప్పట్లోనే చెప్పామని గుర్తుచేశాడు. పోర్ట్ ఎలిజబెత్ టెస్టులోనూ ట్యాంపరింగ్ జరిగిందన్న విషయం తనకు ఇప్పుడే తెలిసిందని పేర్కొన్నాడు.**విచారణను మళ్లీ ప్రారంభించం: క్రికెట్ ఆస్ట్రేలియా**మరోవైపు ఈ వివాదంపై మళ్లీ విచారణ చేపట్టే ఉద్దేశం లేదని క్రికెట్ ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. ఇప్పటికే విచారణ పూర్తయిందని, ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ ఈ అంశాన్ని తెరపైకి తీసుకురావడం వల్ల ప్రయోజనం లేదని సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ టాడ్ గ్రీన్‌బర్గ్ వెల్లడించాడు. అయితే ఖవాజా చేసిన వ్యాఖ్యలకు డేవిడ్ వార్నర్ మద్దతు తెలపడంతో ఆస్ట్రేలియా క్రికెట్‌లో ఈ వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.ఎనిమిదేళ్ల క్రితం ముగిసినట్లు భావించిన సాండ్‌పేపర్ వివాదం.. తాజా ఆరోపణలతో మళ్లీ ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేస్తోంది.



‘పొలిమేర 3‘ గ్లింప్స్

కొమరయ్య తాంత్రికం.. అర్జున్ సర్జా పవర్‌ఫుల్ ఎంట్రీ

ఓటీటీలో మా ఊరి పొలిమేర తెచ్చుకున్న రెస్పాన్స్, ఆ తర్వాత థియేటర్లలో పొలిమేర 2 సాధించిన సక్సెస్ తో ఈ ఫ్రాంచైజీకి మంచి క్రేజ్ ఏర్పడింది. తక్కువ బడ్జెట్ తో మొదలై బాక్సాఫీస్ వద్ద పెద్ద హిట్ కొట్టిన ఈ సిరీస్ ఇప్పుడు మరో కథతో సిద్ధమవుతోంది. దర్శకుడు డాక్టర్ అనిల్ విశ్వనాథ్ మూడో భాగాన్ని అంతకంటే భారీ స్కేల్ లో సిద్ధం చేస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా పొలిమేర 3 నుంచి వదిలిన స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. 5 వీడియో ప్రారంభంలో ఒక పాత గుడి గోపురం చుట్టూ కాకులు తిరగడం, ఆకాశంలో అమావాస్య సూర్యగ్రహణం కనిపించి మిస్టీరియస్ వైబ్ సెట్ చేశారు. ఆ వెంటనే గాల్లో తేలివచ్చే ఈక, విష్ణువు నుంచి శివుడి రూపానికి మారే మార్ఫింగ్ విజువల్స్ చూపించారు. అనంతరం శేషశయనుడైన అనంత పద్మనాభ స్వామి భారీ విగ్రహం తెరపైకి వస్తుంది. గత రెండు భాగాల్లో కథను నడిపించిన కొమరయ్య పాత్ర ఇందులోనూ కొనసాగుతున్నట్లు క్లారిటీ ఇచ్చారు. ఒంటిపై బట్టలు లేకుండా నేలపై ముగ్గుల మధ్య కూర్చుని, పుర్రె ముందు దీపాలు వెలిగించి చేతబడులు చేస్తూ సత్యం రాజేష్ కనిపించిన తీరు పాత సినిమాల ఫ్లేవర్ ను గుర్తుచేసింది. ఈ మూడో పార్ట్ లో కొమరయ్య ఎలాంటి తాంత్రిక పూజలు చేయబోతున్నాడనే దానిపై ప్రేక్షకుల్లో ఆలోచనలు రేకెత్తించేలా ఆ షాట్ కుదిరింది ఈ వీడియోలో అసలైన సర్ ప్రైజ్ ఎలిమెంట్ గా నిలిచింది యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా ఎంట్రీ. విరావి అనే పవర్‌ఫుల్ యోధుడు పాత్రలో ఆయనను పరిచయం చేశారు. నుదుటిపై తిరునామం, రక్తపు మరకలు, పిల్లి కళ్లతో పొడవాటి జుట్టుతో ఉన్న ఆయన రగ్గడ్ అవతారం చాలా కొత్తగా ఉంది. చేతిలో కత్తులు పట్టుకుని అడవిలో శవాల గుట్టల మధ్య నడుస్తూ వచ్చే సీన్ అర్జున్ క్యారెక్టర్ డెప్త్‌ను క్లియర్ గా చాటిచెప్పింది. టెక్నికల్ పరంగా చూస్తే పొలిమేర ప్రపంచం చాలా పెద్దగా విస్తరించినట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతుంది. కృష్ణ ప్రసాద్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సిద్ధార్థ్ కెమెరా పనితనం గ్లింప్స్ కు మంచి థ్రిల్లింగ్ ఫీల్ తెచ్చాయి. వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్లపై నిర్మాతలు ఎక్కడా తగ్గకుండా భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఇందులో బాలాదిత్య, కామాక్షి భాస్కర్ల, గెటప్ శ్రీను, రాకేందు మౌళి కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

‘అలియాస్ రుక్మిణి’ షూటింగ్ పూర్తి..



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా వినోదాత్మక చిత్రం ‘అలియాస్ రుక్మిణి‘ షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొత్తం ముగిసినట్లు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ స్పష్టం చేశారు.
ఈ చిత్రాన్ని నేచురల్ స్టార్ నాని సమర్పిస్తుండగా, యునానిమస్ ప్రొడక్షన్స్ పతాకంపై దీప్తి ఘంటా నిర్మిస్తున్నారు. “అలియాస్ రుక్మిణి షూటింగ్ పూర్తయింది. మరో 25 రోజుల్లో ఎన్నో చెప్పలేని అందమైన భావోద్వేగాలతో కూడిన ఈ చిత్రాన్ని థియేటర్లలో వేడుకగా జరుపుకుందాం“ అని నిర్మాణ సంస్థ పేర్కొంది.దీపావళి పండుగకు ముందు ఈ చిత్రం నుంచి నితిన్ పాత్రకు సంబంధించిన ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో ఆయన ‘యంగ్ కృష్ణ‘ అనే పాత్రలో కనిపించనున్నారు. ఈ వీడియోను పంచుకుంటూ, “ప్రతి ప్రేమకథకు ఒక ‘ముందు‘ కథ ఉంటుంది. యంగ్ కృష్ణ.. ఓ కలలు కనే యువకుడు. ఇందులో నన్ను సరికొత్తగా చూస్తారు“ అని నితిన్ పేర్కొన్నారు. రుక్మిణి ఆయన జీవితంలోకి రాకముందు కృష్ణ జీవితం ఎలా ఉండేదో ఈ వీడియో ద్వారా పరిచయం చేశారు. ఇందులో రుక్మిణి పాత్రలో ఆఫియా సయ్యద్ కనిపించనున్నారు.గతంలో విడుదలైన ఈ సినిమా



టైటిల్ టీజర్ కూడా ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. ఆ టీజర్‌లో నటుడు నాని, దర్శకుడు మురళీ మధ్య జరిగే కథా చర్చ ఆకట్టుకుంది. కృష్ణ కథ అని చెప్పి, రుక్మిణి రాసిన పుస్తకాలను ప్రస్తావించగా.. కుర్చీలో కూర్చుని నిద్రపోతున్న నితిన్ మేల్కొని “రుక్మిణి నా భార్య“ అని చెప్పే డైలాగ్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కాన్సెప్ట్ విన్న నాని ఎంతో ఇంప్రెస్ అయ్యి, షూటింగ్ ఎప్పుడు మొదలుపెడదామని ఉత్సాహం చూపించడం టీజర్‌లో కనిపించింది.ఈ సినిమాకు ప్రముఖ సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. జోమన్ టి. జాన్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించగా, విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. సృజన అడుసుమిల్లి ఎడిటర్‌గా, రేఖ బొగ్గరపు కాస్ట్యూమ్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి రమణ మాధవరం సహ దర్శకత్వం వహించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 4న వెండితెరపై ప్రేక్షకులను పలకరించనుంది.

టాలీవుడ్ పై కన్నేసిన మలయాళ బ్యూటీ!



మాలీవుడ్ నుంచి టాలీవుడ్ కి దిగుమతై సత్తా చాటిన భామలెంతో మంది. ముంబై భామల తర్వాత ఆ రేంజ్ లో ఫేమస్ అయింది కేరళ కుట్టీలే అనడంలో ఎలాంటి సందేహం లేదు. నయనతార, సాయి పల్లవి, నిత్యా మీనన్, మాళవిక మోహనన్, నివేదా థామస్, కీర్తి సురేష్, అనుపమ పరమేశ్వరన్, సంయుక్తా మీనన్ వంటి భామలు టాలీవుడ్ లో ఎంత ఫేమస్ అయ్యారో తెలిసిందే. తాజాగా ఇదే బాటలోనే మరో మలయాళ ముద్దుగుమ్మ అనస్వర రాజన్ టాలీవుడ్ ..కోలీవుడ్ కోటలను కైవసం చేసుకునేందుకు సిద్ధమైంది.మలయాళంలో -తన్నీర్ మథన్ దినంగల్-, -నేరు-, -సుపర్ శరణ్య- వంటి హిట్ చిత్రాలతో నేచురల్ పెర్ఫార్మర్‌గా పేరు తెచ్చుకున్న అమ్మడు ఇప్పుడు తెలుగు, తమిళ ఇండస్ట్రీలపై ఫోకస్ పెట్టింది. సొంత ఇండస్ట్రీలో వరుస హిట్లు అందుకోవడంతో పాటు ఫిల్మ్‌ఫేర్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న అమ్మడు క్యూట్ లుక్స్ .. నటనతో తెలుగు మేకర్స్ దృష్టిని కూడా ఆకర్షిస్తుంది. హోమ్లీ లుక్‌తో పాటు కథానాయికగా ఏ తరహా పాత్రనైనా పండించగల ప్రతిభ ఉండటంతో టాలీవుడ్ నుంచి సొగసరికి అవకాశాలు తలుపు తడుతున్నాయి. దక్షిణాదిలో మార్కెట్‌ను విస్తరించుకునేందుకు ఇదే సరైన సమయమని భావించిన బ్యూటీ టాలీవుడ్ వైపు వేగంగా అడుగులు వేస్తుంది. ఇప్పటికే రౌషన్ మేక సరసన -ఛాంపియన్- చిత్రంతో టాలీవుడ్ లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అక్కినేని నాగార్జున సమర్పణలో రూపొందుతున్న -ఇట్లు అర్జున- అనే క్రేజీ ప్రాజెక్ట్‌లో నటిస్తోంది. అలాగే -7 జీ రెయిన్ బో కాలనీ 2-లోనూ అమ్మడు ఎంపికైంది. -బృందావన కాలనీ- సినిమాకు సీక్వెల్ గా రూపొందుతున్న చిత్రమిదిఅలాగే మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా నటిస్తోన్న -కాకా- చిత్రంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈసినిమా గనుక హిట్ అయితే అనస్వర పేరు టాలీవుడ్ లో మారు మ్రోగిపోతుంది. దీంతో పాటు హీరోయిన్ గా ఎంపికైన చిత్రాలు సక్సెస్ అయితే టాలీవుడ్ లో అమ్మడి ఇమేజ్ కి తిరుగుండదు. ప్రస్తుతం ఫామ్ లో ఉన్న యంగ్ హీరోలకు కొత్త భామలు అవసరం.

“రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నా”..

పొలిటికల్ ఎంట్రీపై హీరో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు



తమిళనాడులో నటుడు విజయ్ రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంతో మరో హీరో సూర్య రాజకీయ ప్రవేశంపై చర్చ మొదలైంది. ఆయన కూడా రాజకీయాల్లోకి వస్తారా? విజయ్ బాటలో నడుస్తారా? అంటూ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ ప్రశ్నలకు సూర్య స్వయంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు.చెన్నైలో జరిగిన తన తాజా చిత్రం ‘సీన్‘ విజయోత్సవ కార్యక్రమంలో సూర్య ఈ విషయంపై మాట్లాడారు. రాజకీయాల్లోకి రావడం లేదని చెబుతూనే.. రాజకీయాలంటే తనకు ద్వేషం లేదని పేర్కొన్నారు. రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నానని చెప్పారు. ఆ రంగంపై పూర్తిస్థాయి అవగాహన, బాధ్యతల గురించి తెలుసుకోకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టబోనని స్పష్టం చేశారు.
సూర్య రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం ఎప్పటి నుంచో ఉంది. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు సాయం చేస్తున్న ఆయన ‘అగరం ఫౌండేషన్’ సేవా కార్యక్రమాలు ఈ చర్చకు కారణమయ్యాయి. సూర్య నటించిన ‘సీన్‘ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తోంది. జీతు మాధవన్ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ కామెడీ చిత్రంలో నజ్రియా నజీమ్, మలయాళ నటుడు నస్లెన్ కీలక పాత్రల్లో నటించారు. నవంబర్ 6న విడుదలైన ఈ సినిమా తొలి మూడు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.116 కోట్లకు పైగా వసూలు చేసినట్లు సాక్‌నిల్క్ వెల్లడించింది. భారత్‌లో నెట్ వసూళ్లు రూ.62.75 కోట్లకు చేరినట్లు పేర్కొంది.

ఎల్ఏసీఎంఏ గాలాలో హృతిక్...

అరుదైన ఘనత సాధించిన తొలి భారత నటుడిగా రికార్డ్



బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అంతర్జాతీయ వేదికపై అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. లాస్ ఏంజిల్స్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఎల్ఏసీఎంఏ ఆర్ట్ + ఫిల్మ్ గాలాకు హాజరైన తొలి భారతీయ నటుడిగా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 7న జరిగిన ఈ 15వ వార్షికోత్సవ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.
ఈ కార్యక్రమానికి హృతిక్ ఇటాలియన్ లగ్జరీ బ్రాండ్ ‘బ్రునెల్లో కుసినెల్లి’ డిజైన్ చేసిన డార్క్ బ్లూ టక్సెడోలో హాజరయ్యాడు. రెడ్ కార్పెట్‌పై ఫొటోగ్రాఫర్లకు రెండు చేతులు జోడించి నమస్కారం పెట్టి, భారతీయ సంస్కృతిని చాటాడు. ఈ దృశ్యాలు, అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ప్రముఖ హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో సహ-చైర్‌గా వ్యవహరించే ఈ గాలా ఆర్ట్, సినిమా రంగాలను ప్రోత్సహించడానికి నిధులు సేకరిస్తుంది. ఈ ఏడాది ఈ వేడుక ద్వారా దాదాపు 70 లక్షల డాలర్లు సమీకరించారు. ఈ ఈవెంట్‌లో హృతిక్‌తో పాటు టామ్ హ్యాంక్స్, కిమ్ కర్దాషియన్, ఆండ్రూ గార్‌ఫీల్డ్, తిమోథీ చలమెట్ వంటి అనేక మంది హాలీవుడ్ ప్రముఖులు పాల్గొన్నారు.ఈ వేడుకలో హృతిక్‌ను భారత సంతతికి చెందిన నిర్మాత కవితా గుప్తా హోస్ట్ చేశారు. ‘డ్యూన్’ చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెన్యూవ్, నటి నికోల్ కిడ్‌మాన్‌లతో హృతిక్ దిగిన ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక సినిమాల విషయానికొస్తే, ఇటీవల ‘వార్ 2’తో విజయం సాధించిన హృతిక్, త్వరలో ‘క్రిష్ 4’ చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రానున్నాడు.